## రాష్ట్రస్థాయి అథ్లెటిక్ క్రీడాకారులకు పతకాలు అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** ఈనె 10వ తేదీన భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపూరి రమేష్ నేషనల్ బ్యాట్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న మక్తల్ అథ్లెటిక్స్ కోచింగ్ సెంటర్ విద్యార్థులకు మూడు బ్రౌంజ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కోచ్ జగదీష్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను మక్తల్ ఎమ్మెల్యే నివాసలో ప్రశంసా పత్రాలను అందించి మెడల్స్ వేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన మక్తల్ పేరు ఇప్పుడు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో వినిపిస్తుదంటే దానికి ఎంతో శ్రమిస్తున్న కోచ్ జగదీష్ కారణమన్నారు.మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి వారికి క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించే స్థాయికి తీసుకొచ్చిన జగదీష్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మున్ముందు కూడా ఇంకా గొప్ప విజయాలు సాధించాలని తెలిపారు. నారాయణపేట జిల్లా క్రీడల అధికారి వెంకటేష్ శెట్టి మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయం వెనుక ఎన్నో నెలల శ్రమ దాగి ఉంది. ఒక్కరోజులో, ఒక్క వారం రోజుల్లో సాధన చేస్తే ఈ విజయం రాలేదని, గత రెండు సంవత్సరాల నుండి నిరంతరం కష్టపడితేనే ఈ పతకాలు సాధించారన్నారు. ప్రతి ఒక్కరు క్రీడలు ఆడి జాతీయ రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొని గొప్ప విజయాలు సాధించాలని తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులలో రాజేశ్వరి సిల్వర్ మెడల్, పార్వతి బ్రౌంజ్ మెడల్ (బాలికల ఉన్నత పాఠశాల మక్తల్), విష్ణు బ్రౌంజ్ మెడల్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల మక్తల్), ప్రవళిక బ్రౌంజ్ మెడల్ (మహాత్మా జ్యోతిరావుపూలె బాలికల పాఠశాల మక్తల్) ఉన్నారు. కార్యక్రమంలో డివైఎస్ఓ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు రవికుమార్, గోవర్ధన్‌శెట్టి, కోచ్ జగదీష్, పిఈటిలు రాజేశ్వరి, పరంజ్యోతి, రమణమ్మ, షాబుద్దిన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## పాఠశాల ప్రారంభోత్సవం ప్రోటోకాల్ పాటించలేదని నెలకొన్న తీవ్ర ఆందోళన...

- ప్రారంభోత్సవానికి పిలిచి అవమానించారంటూ ఎమ్మెల్యే ఆరోపణ
- డీఈఓను అదుపులోకి తీసుకున్న పోలీసులు



డీఈఓను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**ఎంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించి నపాఠశాల భవన ప్రారంభోత్సవంలో డీఈ ఓ గోవిందరాజులు ప్రోటోకాల్ పాటించ కుం డా తమను పిలిచి అవమానించారంటూ నా గర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్ రెడ్డి ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ నేతలు జిల్లా విద్యాశాఖ అధికారిపై దాడికి యత్నిం చడం తో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు డీఈఓను అదుపులోకి తీ సుకొని స్టేషన్‌కు తరలించడంతో తీవ్ర ఉద్రి క్తత వాతావరణం చోటు చేసుకున్న సంఘట న ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం సిర్సవాడ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి తన సొంత ఎంజెఆర్ ట్రస్ట్‌ద్వారా రూ.2.50కోట్లు వెచ్చించి ఆధునిక మౌళిక సదుపాయాలు కల్పించి నూతన పాఠశాలను నిర్మించారు. అనంతరం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. పాఠశాల భవనం పూర్తైన అనంతరం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా ఆదివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. కానీ తాను హజరయ్యే సమయానికి ముందే మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి చేత పాఠశాల ప్రారంభించడాన్ని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాల భవనానికి బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఆయన వర్గం కాంగ్రెస్ నేతలు, ప్రజా ప్రతినిధులందరు డీఈఓ గోవిందరాజులును ప్రశ్నిస్తూ దాడికి యత్నించారు. దీంతో ప్రతిఘటించిన పోలీసులు వెంటనే డీఈఓను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. తనను ప్రారంభోత్సవానికి పిలిచి అవమానించారంటూ డీఈఓపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే కోరారు. దీంతో ఆ గ్రామంలో తీవ్ర గందరగోళం ఉద్రికత వాతావరణం నెలకొంది.


## నా చివరి శ్వాస వరకు ప్రజాసేవ చేస్తూనే ఉంటా...

- నూతన పాఠశాల భవనం ప్రారంభం
- ఎంజెఆర్ ట్రస్ట్ అధినేత, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి



నూతన పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంజెఆర్ ట్రస్ట్ అధినేత, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తూ కార్పొరేట్ స్థాయిలో అన్ని మౌళిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలల నిర్మాణంలో భాగంగా తమ ఎంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించిన (రెండో పాఠశాల) తాడూర్ మండలం సిర్సవాడ గ్రామంలో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ఎంజెఆర్ ట్రస్ట్ అధినేత, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి మర్రి జమున, ఆయన సోదరుడు మర్రి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి బైకాని శ్రీనివాస్‌యాదవ్‌లతో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన శిలఫలకాన్ని ప్రారంభించి పాఠశాల ఆవరణలో ఉన్న గాంధీ, సరస్వతి విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నప్పుడు తాను, తన సోదరుడు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుకున్నామని, తమకు విద్యాబుద్దులు నేర్పిన పాఠశాల శిథిలావస్థలో ఉండటంతో ఎంజెఆర్ ట్రస్ట్ ద్వారా రూ.2.50కోట్లు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని మౌళిక సదుపాయాలతో కొత్తగా పాఠశాల భవనాన్ని నిర్మించామని ఆయన పేర్కొన్నారు. మొదటి పాఠశాల తిమ్మాజిపేట మండల కేంద్రంలో నిర్మించామని, 2వ పాఠశాల సిర్సవాడ గ్రామంలో నిర్మించామని, 3వది తాడూర్ మండల కేంద్రంలో, 4వ పాఠశాల కుమ్మెరగ్రామంలో నిర్మించామన్నారు.మరికొన్ని రోజుల్లో తాడూర్, కుమ్మెర గ్రామాల్లోని పాఠశాలలను ప్రారంభిస్తామన్నారు.తన చివరి శ్వాస వరకు తమ ట్రస్ట్ ద్వారా ప్రజాసేవ చేస్తూనే ఉంటానని, రాబోవు రోజుల్లో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. సమాజంలో డబ్బులు ఉన్న వాళ్ల చాలా మంది ఉన్నారని, వారందరు సమాజ సేవకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ఎంజెఆర్ ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



సరస్వతి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంజెఆర్ ట్రస్ట్ అధినేత, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## ప్రచారంలో తగ్గేదేలే..!

**రేషన్ దుకాణాల్లో ఉచిత బియ్యం పంపిణీ ....**

**కాంగ్రెస్ , బిజెపి ప్రభుత్వాలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు ...**

**ఉచిత బియ్యం ఎవరు ఇస్తున్నారో అర్థం కాని ప్రజలు ...**

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :** ఉచితంగా ప్రజలకు ఏమి ఇచ్చినా దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోనే అమలు చేస్తున్నామని దేశానికి ఆదర్శంగా నిలస్తున్నామని నాయకులు చెబుతున్న మాటలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి వినిపిస్తున్న మాటలివి. కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంజూరు అయ్యే, విడుదల చేసే ప్రతి సంక్షేమ పథకంలో రాష్ట్రంలో అమలు అయ్యే వరకు మొత్తం మా ప్రభుత్వాలు చేశాయంటూ గొప్పలు చెప్పుకోవడం నాయకులకు పరిపాటిగా మారింది. ఆ కోవలోనే ప్రధాని మోడి గ్యారెంటీ ... అందరికి ఆహారం... పౌష్టిక సమాజం వచ్చే ఐదేళ్లలో పాటు పేదలందరికి ఉచిత బియ్యం పేరిట కేంద్ర ప్రభుత్వం , ప్రజా పాలన పేదలకు కడుపునిండా భోజనం అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు తెలిసేలా బిజెపి సర్కారు ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రధాన మంత్రితో పాటు సంబంధిత మంత్రి ఫోటోలు ఏర్పాటు చేయాలని గతంలో కోరినప్పటికి గతం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడంతో కేంద్రమే నేరుగా రంగంలోకి దిగింది. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పేరిట రేషన్ దుకాణాల వద్ద కేంద్రం పేదలకు ఇస్తున్న ఉచిత బియ్యానికి సంబంధించి ప్రధాన మంత్రి ఫోటోతో బోర్డులను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఫోటోలతో తయారు చేసిన ఫ్లెక్సీలు మరో వైపును రేషన్ దుకాణాల ముందు దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల ఎదుట రాష్ట్ర, కేంద్రంకు సంబంధించిన బోర్డులు వేర్వురుగా ఉండేలా చూడాలని రేషన్ డీలర్లకు ఆదేశాలను జారీ చేశారు. రేషన్ షాపుకు వచ్చే లబ్దిదారులు ఈ రెండు బోర్డులను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేయడంతో పాటు ఎవరు ఉచితంగా ఇస్తున్నారు కేంద్రమా లేక రాష్ట్ర ప్రభుత్వాలు అంటూ ముక్కున వేలును వేసుకుంటున్నారు.




జిల్లా కేంద్రంలో రేషన్ దుకాణం వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉచిత బియ్యం పంపిణి ఫ్లెక్సీలు

### రేషన్ డీలర్లో నాయకులు మా ప్రభుత్వం ఇస్తుంది....

రేషన్ దుకాణాలను నిర్వహించే డీలర్లో బిజెపి, కాంగ్రెస్ పార్టిలకు చెందిన నాయకులు ఉన్నట్లయితే మా కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం ఇస్తుందని , మా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బియ్యం ఇస్తుందని రేషన్ షాపులకు వచ్చే లబ్దిదారులకు పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ముందుస్తుగా వివరిస్తూ ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారు. మా ప్రభుత్వం ఇస్తుంది లేదు లేదు మా ప్రభుత్వం ఇస్తుంది ఉచిత బియ్యం అంటూ ప్రచారాలను జోరుగా జరుగుతున్నాయి.

## సంతు సేవాలాల్ మహారాజ్ ఆశయాలను కొనసాగించాలి...

- గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ఏకైక లక్ష్యం..
- ఘనంగా సంతుసేవాలాల్ జయంతి వేడుకలు
- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని గిరిజన భవనం వద్ద మహాభోగ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ ఆశాయాలను గిరిజన సోదరులు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా కొనసాగించాలన్నారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో అన్ని వసతులు ఏర్పాటు చేసి అచ్చంపేట అభివృద్ధికి తోడ్పాటునందిస్తానన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్న గిరిజన సోదరులకు అన్ని విధాలుగా ఆదుకొని ప్రభుత్వ సహయ సహకారాలు అందించడంతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేస్తా నని ఎమ్మెల్యే సూచించారు. సంతు సేవాలాల్ ఆలయం కొరకు ఒక ఎకరం స్థలం కేటాయిస్తానని, వచ్చే సంవత్సరం సంతు సేవా లాల్ నూతన ఆలయంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నా గెలుపుకు 50వేల మెజార్టీ కొరకు కృషి చేసిన ప్రతి గిరిజన సోదరుడికి పేరు పేరున ప్రత్యేక అభి నందనలు తెలిపారు. సంతు సేవాలాల్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఎన్టీఆర్ స్టేడియం నుంచి గిరిజన సోదరులు తమ సాంప్రదాయ దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు గిరిజన సోదరులు తమ ఆచారాల ప్రకారం తల పగిడిని ధరింపజేశారు. అనంతరం ఎమ్మెల్యేను గిరిజన సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో నాయకులు బిచ్యానాయక్, రాములునాయక్, చందునాయక్, లచ్చునాయక్, సీతారాంనాయక్, గోప్యానాయక్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు, గిరిజన సేవా సంఘం నాయకులు తదిత రులు ఉన్నారు.

## కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటాం..




సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

**అలంపూర్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను, అన్ని విధాలుగా ఆదుకుంటామని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్ రామయ్య ఆచారి ఆధ్వర్యంలో శ్రీనివాస్ గౌడ్ అనుచరులు సుమారు 200 మంది కార్యకర్తలు , మహిళలు సంపత్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పక్కాగా ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉండవెల్లి,అలంపూర్, అయిజ మండలాల అధ్యక్షులు గోపాల్, రాము, జయన్న, వెంకటేశ్వర్లు, నాగేశ్, తేజ, రమణ శంకర్, శాలు, ఉపేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తిరుపతిగా భాసిల్లుతున్న.. మన్యంకొండ పుణ్యక్షేత్రం..

- నాటి మునులకొండే..నేటి మన్యంకొండ..
- నేటి నుండి మన్యంకొండ ఉత్సవాలు ప్రారంభం
- మార్చి 23న అలిలేలుమంగతాయారు ఉత్సవాలు ప్రారంభం..- రథోత్సవం 24న
- అమ్మవారి కళ్యాణమహోత్సవం మార్చి 25న
- దేవస్థానం ఏర్పాటులో అళహరి వంశీయుల కృషి అమోఘం



మన్యంకొండ దేవస్థానం (ఇన్‌సెట్లో ) శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామివారు

**దేవరకద్ర,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం తెలంగాణ తిరుపతిగా భాసిల్లుతుంది. నాటి మునులకొండే..నేటి మన్యంకొండగా మారిందని పురాణప్రతీతి..అంతటి విశిష్టత గల మన్యంకొండ దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుండి ప్రారంభం కానున్నాయి.26 వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఉత్సవాలలోని ప్రధానఘట్టమైన స్వామి వారి రథోత్సవం 24న అర్ధరాత్రి దాటిన తరువాత నిర్వహించనున్నారు.ఈ ఉత్సవాలకు జిల్లాతో పాటు తెలంగాణ,మహారాష్ట్రల నుండి కొన్ని వేల మంది భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు. తిరుపతికి వెళ్ళలేని పామరభక్తులు మన్యం కొండకు వస్తే అంతే పుణ్యం దక్కుతుందని భక్తుల ప్రగాడవిశ్వాసం. అందుకే చాలామంది భక్తులు ప్రతి ఏడాది స్వామి వారి దర్శనానికి తరలివస్తుంటారు.

### మన్యంకొండ దేవస్థానం విశిష్టతలు..

మన్యంకొండ దేవస్థానానికి కొన్ని విశిష్టతలు ఉన్నాయి. చెయ్యని పాదాలు,ఉలిముట్టని స్వామివారు,కట్టనిగుడి, తవ్వనికోనేరు మన్యంకొండ సొంతం. అంతేగాకుండా తిరుపతికి మన్యంకొండకు చాలా దగ్గర పోలికలున్నాయి. తిరుపతిలో ఏడు కొండలు దాటి స్వామివారిని దర్శించుకొంటే,,మన్యం కొండలో ఏడు ద్వారాలు దాటి స్వామి వారిని దర్శించుకోవాల్సి ఉంటుంది.

### మహబూబ్‌నగర్‌కు 20కిమిల దూరంలో..

మన్యంకొండ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం మహబూబ్‌నగర్‌కు 20కిమిల దూరంలో దేవరకద్ర నుండి 6కిమిల దూరంలో రాయచూర్ అంతరాష్ట్ర 65వ నెంబరు రహదారి మార్గమద్యలో ఉంది. మన్యంకొండకు వెళ్ళడానికి రైలు, బస్సు సౌకర్యం ఉంది.పకృతి సిద్దమైన కొండపైప గుహలో స్వామి వారు ప్రత్యక్షదైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారు మన్యంకొండ పై కొలవబడుతున్నారు.ఇది ఒకప్పుడు మహారణ్యప్రదేశం అయినందున ఈ కొండచుట్టూ హారిగిరులు ఎన్నో ఉండేవి.మన్యంకొండపై ఎందరో మహానుభావులు తపస్సుచేసి సిద్ధిపొందారు.ఆగుహలు ఇప్పటికి గుట్టపై పదిలంగా ఉన్నాయి.ఈ విధంగా తపస్స చేసిన వారిలో పూర్వజ్ఞాన సంపన్నులు కూడ ఉన్నాట్లు భాగవోత్తముల ద్వార తెలుస్తుంది.సిద్ధి పోందిన వారిలో నరసింహ్మయోగి,ఎత్తేపు రామయోగి, కాశిరాయలు,శ్రీ ఈశ్వరవీరప్పయ్యస్వామి, హనుమద్దాసులవారు ఉన్నారు.ఇందులో ముఖ్యమైన వారు ఎత్తేపు రామయోగి,హనుమద్దాసులవారు.

### దేవస్థానం చరిత్ర..

తమిళనాడులోని శ్రీరంగం సమీపంలోగల అళహరి గ్రామనివాసి అళహరి కేశవయ్య కలలో శ్రీనివాసుడు కనిపించి కృష్ణానది సమీపంలోగల (మునులకొండ)మన్యంకొండపై నేను వెలసియున్నాను.నీవు వెంటనే అక్కడ్కిఇ వెళ్ళి నిత్య సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించి అంతర్థానమయ్యారు.అప్పుడు అళహరి కేశవయ్య నిద్రలో నుండి మేల్కొని స్వామివారి ఆజ్ఞాప్రకారం వెంటనే కుటుంబసమేతంగా మన్యంకొండ సమీపంలోని కోటకద్రకు వచ్చి స్థిరపడి మన్యం కొండపై నిత్య సేవ చేయడం ప్రారంభించారు.అళహరి కేశవయ్య కూడ దక్షిణాదిలోగల అన్ని దివ్యక్షేత్రములు సందర్శించి తరించిన మహానుబావులు.అయితే ఒకరోజు అళహరి కేశవయ్య కృష్ణానదిలో స్నానం చేస్తూ గొంతువరకు నీటిలో మునిగి సూర్యభగవానునికి దోసిటితో అర్ఘ్యం వదులుతున్న సమయంలో చక్కని శిలారూపంలో గల వెంకటేశ్వరస్వామి వారి ప్రతిమ నదిలో అలల ద్వారా వచ్చి అళహరి కేశవయ్య దోసిలిలో నిలిచింది.ఈ విధంగా నదిలో వచ్చి దోసిలిలో నిలిచిన విగ్రహాన్ని ఆయన పరిశీలించగా అది శ్రీనివాసునిగా గుర్తించారు. అప్పుడు ఆ ప్రతిమను తీసువకవచ్చి మన్యం కొండపై శేషసాయి రూపంలోగల గుహలో ప్రతిష్ఠించి నిత్య ధూపధీప నైవేధ్యాలతో స్వామివారిని ఆరాదిం చిసంతసించెను.అలాగే స్వామి ముందు మండపంలో ఆంజనేయస్వామి,గరుడల్వారు విగ్రహాలను ప్రతిష్ఠించారు.మన్యంకొండపై శివకేశవులకు బేదంలేదంటారు. ప్రభుత్వ,భక్తుల సహాకారంతో మన్యంకొండ దేవస్థానం దినదినాభి వృద్ధి చెందుతుంది. రూ.కోటికి పైగానే దేవస్థానానికి ఆదాయం వస్తుంది.

### దేవస్థానం ఏర్పాటులో అళహరి వంశీయుల కృషి అమోఘం..


మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అమోఘమని చెప్పవచ్చు. అళహరి గ్రామనివాసి అళహరి కేశవయ్య కృషి వల్లే ఇది సాద్యమైందంటారు. అందుకే దేవస్థానం ఏర్పాటు విషయంలో అళహరి వంశీయుల పాత్ర చాలా ఉంది. ఇప్పటికి మన్యంకొండ దేవస్థానంలో దేవస్థానం అభివృద్ధికి పాటుపడిన అళహరి వంశీయుల వంశవృక్ష చిత్రం ఉంది. ప్రస్తుతం ఆ వంశానికి చెందిన అళహరి మధుసూధన్‌కుమార్ దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త,చైర్మెన్‌గా కొనసాగుతున్నారు. అంతేగాకుండా ప్రతి ఏడాది ఉత్సవాలు ప్రారంభం రోజు స్వామివారిని కోటకద్రలోని అళహరి వంశీయుల ఇంటి నుండే గుట్టపైకి తీసుకవస్తారు. ఉత్సవాల ముగింపు రోజు కూడ స్వామి వారిని అక్కడికే తీసుకెళ్తారు.

### ఉత్సవ విశేషోత్సవాలు..

మన్యంకొండ ఉత్సవాల సందర్భంగా ఉత్సవాలలో ప్రతి రోజు రాత్రి దేవస్థానంలో ఓ సేవ చొప్పున నిర్వహించనున్నారు. మొదటి రోజు తిరుచ్చిసేవతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు.అలాగే 20న హంసవాహనసేవ,21న గజవాహనసేవ,22న సూర్యప్రభవాహనసేవ,23న హనుమవాహనసేవ,24న గరుడవాహనసేవ,అర్ధరాత్రి రథోత్సవం,25న అశ్వవాహనసేవ,ద్వితీయ ప్రభోత్సవం,26న స్వామి వారి దర్బారువాహనసేవ,మార్చి 2న శేషవాహనసేవ,8న మహాశివరాత్రి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

### మార్చి 23న అలిలేలు మంగతాయారు ఉత్సవాలు ప్రారంభం

దేవస్థానం దిగువకొండ వద్ద కొలువుదీరిన శ్రీ అలిలేలుమంగ తాయారు అమ్మవారి ఉత్సవాలను మార్చి 23 నుండి 27 వరకు జరుగనున్నాయి. ఉత్సవాలలోని ప్రధాన ఘట్టమైన అ మ్మవారి తిరుకళ్యాణమహోత్సవాన్ని మార్చి 25న మధ్యా హ్నాం 12లకు నిర్వహించనున్నారు.ఉత్సవాల మొదటి రోజు అమ్మవారి సన్నిధిలో అంకురార్పణం పూజా కార్యక్రమంతో అమ్మవారి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు.అలాగే 24న ధ్వజారోహణం,దేవతాఆహ్వానం,26న అశ్వవాహనసేవ, 27న పూర్ణాహుతి,వసంతోత్సవం పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.ఈ ఉత్సవాలలో భక్తులు అధికసంఖ్య లో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని దేవస్థా నం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్‌తో పాటు అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజులు కోరారు.



మన్యంకొండ దేవస్థానం


### ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..



"మన్యంకొండ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది.భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.ఇదివరకే చాలా పనులను మన్యంకొండలో చేపట్టడం జరిగింది.దీనికి సహకరించిన వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు.ఉత్సవాలలో భక్తులు పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి.ఉత్సవాలు సజావుగా జరుగడానికి అందరు దేవస్థానానికి సహకరించాలి.

దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్

## కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన కాంగ్రెస్ పార్టీ



**కొత్తకోట ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీదేవి థియేటర్ పక్కన 5వ వార్డుకు చెందిన ఉల్లెకాని గట్టు యాదవ్ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా దగ్ధం అయింది. వారికి లక్షలలో ఆస్తి నష్టం జరగగా ఇది గమనించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేయమని చెప్పడంతో వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వారి కుటుంబానికి పదివేల రూపాయలు , 25 కేజీల బియ్యం ప్యాకెట్‌ను అందజేశారు. ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారులను వారి ఇంటికి పంపించి వివరాలు సేకరించి వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇంకా భవిష్యత్తులో వారి కుటుంబానికి ప్రభుత్వం తరపున వచ్చే పథకాలను అమలు చేస్తామని నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, దేవరకద్ర నియోజకవర్గం నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, పట్టణ నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణకు ఆలన్న లక్షసాయం



**కొత్తకోట ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణంలో నిర్వహిస్తున్న శ్రీ ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఈ నెల 23 న జరగగా అందుకు సంబంధించిన ఏర్పాట్లకు దేవరకద్ర మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి లక్ష రూపాయలు ఆర్థికసాయం చేశారు. అందుకు సంబంధించిన నగదును స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా హిందూ వాహిని కార్యకర్తలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని విశ్వేశ్వర్, ఎంపీపీ గుంత మౌనిక, మల్లేశ్, సిడిసి చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, భీమ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వడ్డే శ్రీనివాసులు, కౌన్సిలర్ చింతలపల్లి సంధ్య, రవీందర్ రెడ్డి, కోఆప్షన్ సుజాత శ్రీనివాసులు, వసీమ్ ఖాన్, ఉద్యమకారులు గులాబీ గోవిందు, పాపయ్య, రవీందర్ రెడ్డి, ఏసు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి..

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** టివివి జిల్లా సమన్వయకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ మండల పరిధిలోని బిజ్వార్ నుండి పులిమామిడి మీదుగా జక్లేర్ వరకు రహదారి మరమ్మతు పనులు చేపడుతున్నారని కానీ గుత్తేదారులు పూర్తి స్థాయిలో గుంతలకు ప్యాచ్ వర్క్ చేయకుండా వదులుతున్నారని, కొన్నిచోట్ల మాత్రమే తారువేసి మరికొన్ని చోట్ల కంకర పరిచి వదిలేశారని టివివి జిల్లా సమన్వయకర్త బిజ్వార్ మహేష్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంవత్సరాల తరబడి రహదారి గుంతల మయంగా ఉందని ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న మరమ్మతులను కూడా గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పూర్తి స్థాయిలో గుంతలను గుర్తించకుండా తూతూ మంత్రంగా రిపేర్ వర్క్ పూర్తి చేస్తున్నారని మహేష్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గుత్తేదారులు పూర్తిస్థాయిలో గుంతలను పూడ్చి తారును నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే తమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.





నాణ్యత లేకుండా రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

## వ్యవసాయ మార్కెట్ రైతులకు సీబీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం...



**అచ్చంపేట, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ పంటను విక్రయించడానికి వచ్చిన రైతులకు సీబీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పంటను విక్రయించుకోవడానికి వచ్చి పంట అమ్ముడుపోక పడిగాపులు కాస్తున్న రైతులకు ఆకలి తీర్చాలనే ఉద్దేశ్యంతో సీబీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించానని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మార్కెట్‌కు వచ్చిన రైతులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులకు మద్దతు ధరతో పాటు రైతులకు మార్కెట్ యార్డ్‌లో ఉచిత అన్నదాన సదుపాయం కల్పించినందుకు ఎమ్మెల్యేకు రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**వెల్దండ, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి మంజూరైన నూతన సీసీ రోడ్డు పనులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆదివారం మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, మట్ట వెంకటయ్యగౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బసనమోని శ్రీను ముదిరాజ్‌లు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామంతో పాటు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య,రషీద్, హమీద్, కృష్ణ ముదిరాజ్, మల్లేష్ ముదిరాజ్, అలీ, రమేష్ ఉన్నారు.

## మాగనూరు ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన ఎండి అబ్దుల్ ఖాదర్




**మాగనూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** నూతన ఎస్‌హెచ్‌గా ఎండి అబ్దుల్ ఖాదర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను ఇంతకుముందు జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి పోలీస్ స్టేషన్ ఉండి బదిలీపై మాగనూరుకు వచ్చారు. ఇంతకు ముందు ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తించిన ఎస్సై మల్లేష్ నాగర్‌కర్నూల్ జిల్లా విఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై ఎండి అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ మాగనూరు మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని,చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని ఎస్సై కోరారు.

## వివాహవేడుకల్లో కొండ ప్రశాంత్‌రెడ్డి



**దేవరకద్ర,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలో సోమవారం జరిగిన పలు వివాహవేడుకల్లో బిజెపి దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశిర్వదించారు. ఈ కార్యక్రమంలో నరేశ్‌చారి,కృష్ణంరాజు,కేపీఆర్ యూత్ అధ్యక్షుడు రాజు,విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో జోరుగా గ్రామ కమిటీలు..

**కొత్తకోట,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** కొత్తకోట మండలం వడ్డేవాటు,కనాయపల్లి,నాంచారం పేట,గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగరపు బీచుపల్లితో పాటు మండల నాయకులు పర్యటించి గ్రామ కమిటీలను ఎన్నికను ఏకగ్రీవం చేశారు.వడ్డేవాట గ్రామ అధ్యక్షుడు బి.లక్ష్మీ నారాయణ,ఉపాధ్యక్షులు శంకర్ నాయక్ ప్రధాన కార్యదర్శి యుగంధర్ రెడ్డి సంయుక్త కార్యదర్శులు బాలరాజ్ కోశాధికారి ఉదయ్ కుమార్ గౌడ్ సలహాదారులు మల్ల రాములు, తిరుపతయ్య,భాస్కర్ రెడ్డి,గొల్ల భీమన్న,సుక్క బాలస్వామి,జె.బాలస్వామి, గొల్ల స్వామి,మహేష్ బాబు,హతి రామ్ నాయక్,కిసాన్ సెల్ అధ్యక్షులు నక్క రాములు,ఎస్సీ సెల్ నరసింహ,ఎస్టీ సెల్ ఈశ్వర్ నాయక్,బిసిసెల్ మేఘనాథ్ గౌడ్,మైనార్టీసెల్ ఉస్మాన్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్ నందిషా,ఉపాధ్యక్షులు ఏ రాజశేఖర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ఎల్ సెవ్యనాయక్,సంయుక్త కార్యదర్శి గొల్లతిరుపతయ్య,కృష్ణనాయక్,కోశాధికారి ఎల్ లక్ష్మణ్‌నాయక్,సలహాదారులు ఎల్ భోజ్యా నాయక్,కే మన్యం హనుమంతు,హర్య నాయక్ పాండు నాయక్,రాములు,లక్ష్మణ్ కిసాన్ సెల్ ఏ సురేందర్ రెడ్డి,ఎస్ టి సెల్ ఎల్ నారాయణ నాయక్,బిసిసిఎల్ ఎమ్ రామకృష్ణ ఎన్ ఎస్ యుఐ ఎస్‌రామ్,యూత్ అధ్యక్షులు బద్రీనాథ్,ఉపాధ్యక్షులు శ్రీను, ప్రధాన కార్యదర్శి పి కిషన్,కోశాధికారి శివశంకర్ ఎం రాజులను ఎన్నుకున్నారు.అదేవిధంగా కానాయపల్లి గ్రామఅధ్యక్షుడు గారాములు, ఉపాధ్యక్షులు వడ్డే శివశంకర్,వసుల కురుమయ్య,బొజ్జన్న, కార్యదర్శి శశికుమార్,ప్రధాన కార్యదర్శి ఆర్‌శ్రీనివాసులు,కోశాధికారి రాఘవేందర్, సలహాదారులు భాజ బందెన్న నక్కల రవి,బాలస్వామి,డి మాసన్న,డి నాగరాజ్,రామకృష్ణ యూత్ అధ్యక్షులు బి గాంధీ,ఉపాధ్యక్షులు వడ్డే వెంకటేష్,ఈ వెంకటేష్,ప్రధాన కార్యదర్శి నారమ్మని గోవర్ధన్,ప్రచార కార్యదర్శి హరికృష్ణ,కోశాధికారి రాము,అధ్యక్షులు పసుల నాగన్న,తోకల మహేష్,బుగ్గపల్లి రవి,బుగ్గపల్లి అనిల్,టి రాజు,టి బాలరాజు,ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహులు,ఉపాధ్యక్షులు ఆర్ రాములు,రాకేష్,మన్నెం,ప్రచార కార్యదర్శి సత్యం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్,కోశాధికారి పి శివకుమార్ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి,మాజీ జడ్పిటిసి జితేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరుణాకర్ రెడ్డి,రంలాల్ నాయక్,మాజీ సర్పంచ్ తరుణ్ నాయక్,గోకరయ్య, కరాటే శివ,బీచుపల్లి గౌడ్,భాను ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, బొందల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో కమిటీలను నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు...

### ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,కే సూర్యం



ఆత్మకూరులో మున్సిపల్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి కే సూర్యం

**అమరచింత,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** కార్మికుల హక్కుల చట్టాలను అమలు చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను పూర్తిగా హరిస్తున్నాయని ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం అన్నారు.ఆదివారం ఆత్మకూరు మున్సిపల్ కేంద్రంలోని మున్సిపల్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దేశంలో వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం 26000 ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన పాలక ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆయన అన్నారు.అలాగే మున్సిపాలిటీ,గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న కార్మికులకు చాలీ చాలని వేతనాలతో పనిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికులకు ఇన్సూరెన్స్,వైద్యం,ఈఎస్ఐ ఇవ్వాలని నిబంధనలు ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రైతు వ్యతిరేక చట్టాలను అమలు చేసి కార్పొరేట్ సంస్థలకు మేలు జరిగే చట్టాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్నారన్నారు.కార్మిక కర్షక రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లాకోశాధికారి రాజు,ఐఎఫ్టియు నాయకులు హనుమంతు, ప్రసాద్,సామేలు,సత్తన్న,వెంకటేష్,ఇస్మాయిల్,పద్మ శివకుమార్,రేణుక,సత్యమ్మ,మైను,దశరథ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలి:జబ్బార్




గ్రామ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

**వీపనగండ్ల,ఫిబ్రవరి 18,ప్రభాతవార్త :** రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి పార్టీని ఓడించాలని సిపిఎం పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండి జబ్బర్ ప్రజలకు పిలుపునిచ్చారు.ఆదివారం నాడు సిపిఎం వీపనగండ్ల గ్రామ కమిటీ సమావేశం పార్టీ మండల కార్యాలయంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసం,మతాల మధ్య చిచ్చు,కుల వివక్షత అసమానతలను కొనసాగించే విధంగా బిజెపి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తుందన్నారు.దేశంలో రోజురోజుకి నిత్యవసర సరుకులు ధరలు హద్దు అదుపు లేకుండా పెరుగుతున్నాయని, బియ్యం ధరలు రెక్కలు వచ్చాయి,పప్పు ధరలు కొండెక్కి అన్నారు.ప్రజల కొనుగోలు శక్తి దెబ్బ తినే విధంగా ఉపాధి,ఆదాయం తగ్గిందన్నారు.మనదేశంలో యువత 65 శాతం వరకు ఉన్నారు.వీరిలో గణనీయమైన సంఖ్యలో ఉపాధి ఉద్యోగం కరువై నిరుద్యోగులుగా తిరుగుతున్నారు.బిజెపి ఎన్నికల సందర్భంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నేటికి అమలు చేయకపోవడం దారుణమైన విషయం అన్నారు. ఉపాధి అవకాశాలను దెబ్బతిస్తూ కార్పొరేట్లకు లాభాలు కట్టబెడుతుంది అన్నారు.పన్నుల భారాన్ని పేదలపై పెద్ద ఎత్తున పెంచారు.పరోక్ష పన్నులు అనగా జీఎస్టీ నిత్యవసర సరుకులపై సెస్సులు వేస్తున్నారు.ధనికుల పై వేసే ప్రత్యక్ష పనులు మాత్రం ఇతర దేశాలలో 30 శాతం ఉండగా,మన దేశంలో 25 నుండి 28 శాతం మాత్రమే విధిస్తుందన్నారు.దీన్నిబట్టి పేదల ఒక్క రకంగా,ధనికుల కొక్కరకంగా పన్నుల విధానం వేస్తూ ఇది కార్పొరేటర్ శక్తులు అనుకూలమైన ప్రభుత్వం అన్నారు.కాబట్టి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని వారు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బాల్ రెడ్డి,మండల కమిటీ సభ్యులు ఆశన్న,ఈశ్వర్,నాయకులు వెంకటేశ్వర్లు గౌడ్,రామకృష్ణ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటే ఆత్మరక్షణకు ఆరోగ్యానికి అవసరం..



బహుమతులు సాధించిన విద్యార్థులు

**కొత్తకోట ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కరాటే ఆత్మరక్షణకు ఆరోగ్యానికి అవసరమని మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు కొమ్ము భరత్ భూషణ్, ఖాజా మైనోద్దిన్, కోఆప్షన్ సభ్యులు జెఎం మిషేక్‌లు అన్నారు. ఆదివారం కొత్తకోట పట్టణానికి చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో పాత జూనియర్ కళాశాలలో జరిగిన మాస్టర్ అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో జరిగిన కరాటే విద్యార్థుల విన్యాసం కరాటే బెల్టులు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించగా కరాటే మాస్టర్ అబ్దుల్ నబీ సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరాటే పోటీలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత లభించిందని ఒలంపిక్‌లో కరాటేకు ప్రత్యేక ప్రాధాన్యత లభించిందని బాలికలు సైతం కరాటే పోటీలు నేర్చుకోవడానికి ముందుకు రావడం శుభపరిణామమని మహిళల ఆత్మరక్షణకు కరాటే ఒక వరంలా పనిచేస్తుందని అన్నారు. అనంతరం కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులను ప్రధానం చేసి అభినందించారు. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన గాడ్స్ ఆన్ వారియర్ కరాటే మాస్టర్ రఫీల్లా ఖాద్రి కి కౌన్సిలర్ ఖాజా మైనోద్దిన్ శాలువాతో సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు యన్‌జె బోయెజ్ మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ లతీఫ్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సలీంఖాన్, బిఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షులు ఎండి బాబా, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు డా.సాజిత్ అలీలు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాల్‌రెడ్డి, పట్టణ మైనార్టీ ప్రచార కార్యదర్శి ఎండి జహీర్, కరాటే మాస్టర్లు, జాఫర్ సాదిక్, జి.హరీఫ్ యాదవ్, కైసర్, ఎండి జాంగిర్, ఇంతియాజ్, అంజి, కార్తికేయ లాస్య, పవన్, తేజ్ యాదవ్ లతో పాటు కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

## దివంగత సర్పంచ్ మల్లయ్య సేవలు మరువలేనివి..

### -టీపీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్



మల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కల్వకుర్తిరూరల్, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** దివంగత సర్పంచ్ మల్లయ్య గ్రామానికి చేసిన సేవలు మరువలేనివని టీపీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ పేర్కొన్నారు. ఆదివారం కల్వకుర్తి మండలం మార్చాల గ్రామ దివంగత సర్పంచ్ ఆవ మల్లయ్య 2వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి, జెడ్పీవైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై వ్యవసాయ క్షేత్రంలో ఉన్న మల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బాలాజీసింగ్ మాట్లాడుతూ గ్రామ సేవ కొరకు సర్పంచ్‌గా ఎన్నిక కావడం, సర్పంచ్ పదవి పూర్తి కాకుండానే మృతి చెందడం బాధకరమన్నారు. సర్పంచ్‌గా కొనసాగినన్ని రోజులు గ్రామానికి ఎనలేని సేవలు చేశారని, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ చైర్మన్ మల్లెపల్లి జగన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ షాన్‌వాజ్‌ఖాన్, మార్చాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, నాయకులు నిజామొద్దిన్, భారతీ, జలాల్, మక్బూల్, శేషిరెడ్డి, రామచంద్రయ్య, శ్రీశైలం, సుధాకర్‌రెడ్డి, పాండు, అంజిరెడ్డి, శ్రీశైలం, వెంకటచారి, ఖాజామైనుద్దిన్, రామానుజన్, పాండుకుమార్, పరమేశ్వర్, మల్లయ్య కుటుంబ సభ్యులు మల్లమ్మ, లక్ష్మి, ఆవ తిరుపతి, పద్మ శ్రీనివాసులు, ఆవ రవి, బీర్బాల్, యువజన కాంగ్రెస్ నాయకులు పాండు, అరుణ్‌రెడ్డి, పరమేష్, విశ్వేశ్వర్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా :డీఈఓ గోవిందరాజులు



మీడియాతో మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** సిర్సవాడ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవం ఆదివారం ప్రోటోకాల్ ప్రకారం గౌరవ శాసనసభ్యులు కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని, భవన నిర్మాణ దాత ఎంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిలతో పాటు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించామని డీఈఓ గోవిందరాజులు తెలిపారు.ఎంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్‌అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి వారి అనుచరులతో ముందుగానే వచ్చి ప్రధానోపాధ్యాయులు వద్దని వారించినప్పటికి వినిపించుకోకుండా వారు స్వయంగా తెచ్చుకున్న రిబ్బన్‌ను పాఠశాల గేట్‌కు కట్టి ప్రారంభించారని, దీంతో పాటు లోపలికి వచ్చి శంకుస్థాపన శిలఫలకాన్ని (2022 సం॥కు సంబంధించినది) ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. తదుపరి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి వచ్చిన తర్వాత గ్రామస్తులు విషయాన్ని తెలియజేయడంతో వెంటనే ప్రధానోపాధ్యాయులు, ఎంఎల్డీ గారితో చర్చించి ఎంజెఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి వారి అనుచరులు ముందుగానే వచ్చి ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి రిబ్బన్ కటింగ్ కార్యక్రమం చేసినందుకు ఆదివారం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు డీఈఓ గోవిందరాజులు మీడియాతో వెల్లడించారు. తదుపరి ప్రారంభోత్సవ కార్యక్రమ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

## మల్దకల్ దేవాలయం దర్శించుకున్న బిఎస్ కేశవ్



**మల్దకల్ ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ఆదిశిల క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఆదివారం మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయనకు దేవాలయ చైర్మన్ ప్రహ్లాద రావు శేష వస్త్రంతో సన్మానించారు.

## శివ స్వాములకు ఆర్థికసాయం..



**కొత్తకోట ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కొత్తకోట పట్టణ కేంద్రంలో శనివారం రాత్రి శివమాల వేసుకున్న గట్టు యాదవ్ ఇల్లు సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇల్లు అందులో ఉన్న వస్తువులు కాలిపోయి నిస్సయస్థితిలో ఉన్న గట్టు యాదవ్ స్వామికి తోటి శివస్వాములు మానవత్వం చూపించారు. అందరూ తోచినంత సాయం పోగు చేసి 10 వేలు జమ చేసి సాయంగా అందజేశారు. ఆపదలో ఆదుకుని ఆ కుటుంబానికి అండగా నిలిచిన శివస్వాములను స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ శివ స్వాములను అభినందించారు.

## ఘనంగా ముగిసిన ఉత్సవాలు..



**కల్వకుర్తి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఉన్న శ్రీ లక్ష్మి పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రథసప్తమి సందర్భంగా స్వామి వారికి కళ్యాణం, పల్లకి సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి పల్లకి సేవతో పాటు ప్రత్యేక కార్యక్రమాల అనంతరం ఉత్సవాలు ముగిసినట్లు దేవాలయ ఫౌండర్ ట్రస్టీ కల్వ మనోహర్ తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్సవాలకు సహకరించిన దాతలను శాలువాలతో ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఘనంగా సన్మానించారు.

## 20న ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ఉప్పునుంతల,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** దూప, దీప, నైవేద్య పథకం కింద అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్ల సాధనకై ఈనెల 20న తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అర్చకులుఅధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నూతన ఎస్ఐ మహేందర్‌కు ఘన సన్మానం



**వంగూరు, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త:** ఇటీవల వంగూరు మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌ను మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్ఐ మహేందర్‌ను ఆదివారం మాల మహానాడు సంఘం సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. సన్మానించిన వారిలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న జెట్టి వెంకటేష్, జిల్లా కన్వీనర్ మబ్బు మల్లేష్, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు చింత రవి, నాయకులు భగవంతుడు, అంతయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## శ్రీశ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న కెటిదొడ్డి మండల ఎస్సై శ్రీనివాస్‌రావు



**కెటిదొడ్డి, ఫిబ్రవరి 18 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పాగుంట వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీశ్రీ పాగుంట వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి దేవాలయంలో ఆదివారం కెటిదొడ్డి మండలానికి నూతన ఎస్సైగా వచ్చిన సందర్భంగా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసిపాగుంట వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు పూజారులు, ఆలయ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబ సభ్యులను శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

